Tel Tel - 20684

మన

# ప్రజా అక్షరం

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...

TELUGU DAILY NEWS PAPER

తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 213

మంగళవారం అక్టోబర్ 06 2026 - పేజీలు - 8

PUBLISHED FROM HYDERABAD RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, VIJAYAVADA, VISHAKAPATNAM, TIRUPATHI






## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

- సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్
- బాధితుడిగా వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- రేవంత్ రెడ్డి పిటిషన్‌పై వాడీవేడీగా విచారణ

**హైదరాబాద్, అక్టోబర్ 5 :** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి మిగతా2లో...

## అర్హుల ఓటు చేజారనివ్వం

- రెండు నెలల పాటు ఓటు పరిరక్షణ ఉద్యమం: పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్






## భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 :** అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూఢిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ మిగతా2లో...

## సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్

**ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున చెల్లింపు**

**హైదరాబాద్, అక్టోబర్ 5 :** రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల సందర్భంగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని ఆయన పేర్కొన్నారు.సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే మిగతా2లో...

## మహిళలపై నేరాలను అరికట్టండి

- శిక్షలతో దుండగులకు వణుకు పుట్టాలి
- సామాజిక వ్యతిరేక శక్తుల్లో భయం సృష్టించాలి
- ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు కీలక సూచన
- ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యాచార ఘటనలపై విచారణ



**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 :** మహిళలపై నేరా లకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తుల మనసుల్లో భయాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని సుప్రీం మిగతా2లో...

## డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పారు చేయండి

- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు నిర్మించండి
- అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి
- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు డీపీఆర్ వేగవంతం చేయాలి
- కేంద్ర మంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి




## రేవంత్ సర్కార్ కుట్రలు

- వారసత్వ కట్టడాలను కూల్చేసే పన్నాగం
- బొగ్గు గని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి
- లేకుంటే పెద్ద ఎత్తున మేం ఉద్యమిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్






## సింగరేణి కార్మికుల సమస్యలు రెండు నెలల్లో పరిష్కరించాలి

- పరిష్కరించకుంటే నిరవధిక నిరాహార దీక్ష: కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబర్ 5 :** సింగరేణి కార్మికుల సమస్యలను రెండు నెలల్లోగా పరిష్కరించాలని తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షురాలు, హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద కార్మికులతో కలిసి ఆమె నిరసన చేపట్టారు. సమస్యలకు పరిష్కారం చూపకపోతే సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు.సింగరేణి కార్మికులకు సంస్థ లాభాల్లో 35 శాతం వాటా ఇవ్వాలని, వైద్య బోర్డు సమస్యలను పరిష్కరించాలని, నెలకు రెండుసార్లు వైద్య బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్మికుల పేర్లలో మిగతా2లో...

## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటాం
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ
- ఫారమ్-6 మార్పులపై సుప్రీం వ్యాఖ్యలు
- సీఈసీ జ్ఞానేశ్ నిర్ణయాలపై పిటిషన్లు..
- కేంద్రం, ఈసీకి సుప్రీం నోటీసులు జారీ
- వారంలో సమాధానం ఇవ్వాలని ఆదేశం
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ చేర్చాం
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టం






ప్రజా అక్షర న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్– స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా– యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్– స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు. మరోవైపు భారత్– స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిదని కొనియాడారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ఈ మేరకు సోమవారం దిల్లీలో ప్రధానమంత్రి మోదీ, స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టారు. కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పటిష్టం చేసేలా అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రాబోయే 15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు లక్ష్యంగా ప్రతిష్టాత్మక ఆర్థిక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్‌తో ద్వైపాక్షిక చర్చల అనంతరం నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. భారత్– స్విట్జర్లాండ్ స్నేహం శతాబ్దాల నాటిది. ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, అధునాతన సాంకేతికత నేడు మన పునాదికి బలమైన స్తంభాలుగా ఉన్నాయి. నేటి శిఖరాగ్ర సమావేశంతో మన భాగస్వామ్యానికి కొత్త వేగాన్ని, కొత్త శిఖరాలను అందించబోతున్నాం. ఇది పెట్టుబడి, ఆవిష్కరణ, ఉద్యోగాలు, పరస్పర శ్రేయస్సు కోసం రూపొందించిన ఒక ప్రతిష్టాత్మక ప్రణాళిక. దీనితో రాబోయే 15 ఏళ్లలో భారతదేశంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి, 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలను సాధిస్తాం. స్విట్జర్లాండ్‌లో భారతదేశ ఎగుమతులకు మార్కెట్‌ను పెంచడానికి, రెండు దేశాల మధ్య పెట్టుబడులను మరింత సులభతరం చేయడానికి మేము అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. దీనివల్ల స్విట్జర్లాండ్‌కు భారతదేశ వ్యవసాయ, ఫార్మా, వస్త్ర, ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతి పెరుగుతుంది.

# ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 :** కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్–6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్–6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్–6లో అసలు మార్పు జరిగిందా జరిగితే ఎవరు చేశారు అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్–6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్–6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్–6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్–1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్–6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

# వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. 'లైట్–గేటెడ్ అయాన్ ఛానల్స్', 'ఆప్టోజెనెటిక్స్' అంశాలపై సమగ్ర పరిశోధనలు నిర్వహించిన ఈ శాస్త్రవేత్తలు జర్మనీ, అమెరికాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్నారు. 'మెదడులోని రహస్యాలను ఛేదించడానికి ఈ విధానాన్ని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధనాశాలల్లో వినియోగిస్తున్నారు" అని శాస్త్రవేత్తల కృషిని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా నోబెల్ కమిటీ కొనియాడింది. నోబెల్ కమిటీ వెల్లడించిన వివరాల ప్రకారం... డీసెరోత్ కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో, హెగెమాన్ బెర్లిన్‌లోని హంబోల్ట్ విశ్వవిద్యాలయంలో, నాజెల్ జర్మనీలోని వుర్జ్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో సేవలందిస్తున్నారు. విజేతలు ముగ్గురితోనూ సోమవారం ఫోన్‌లో మాట్లాడినట్లు వైద్య విభాగం నోబెల్ కమిటీ కార్యదర్శి థామస్ పెర్ల్‌మాన్ తెలిపారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్‌లో ఈ బహుమతిని ప్రకటించడంతో నోబెల్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నోబెల్ బహుమతి కింద 12 మిలియన్ స్వీడిష్ క్రోనార్లు (సుమారు 1.2 మిలియన్ డాలర్లు) అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని ముగ్గురికి మూడు సమాన భాగాలుగా పంపిణీ చేయనున్నారు.గతేడాది వైద్య శాస్త్రంలో రోగనిరోధక వ్యవస్థ పై పరిశోధనలు చేసిన ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ అవార్డు దక్కిన సంగతి తెలిసిందే. మంగళవారం భౌతిక శాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్య విభాగంలో నోబెల్ విజేతల పేర్లను ప్రకటిస్తారు. శుక్రవారం శాంతి బహుమతిని ప్రకటించిన అనంతరం, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో నోబెల్ స్మారక బహుమతిని ప్రకటిస్తారు. స్టాక్‌హోమ్‌లోని కరోలిన్స్కా ఇన్‌స్టిట్యూట్, రాయల్ స్వీడిష్ అకాడమీ, నార్వేజియన్ కమిటీలు నోబెల్ బహుమతులను అందజేస్తాయి. ఏటా అక్టోబరు మొదటి వారంలో విజేతలను ప్రకటించి, డిసెంబరు 10 ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజున బహుమతులను ప్రధానం చేస్తారు.

# డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ఏర్పారు చేయండి

**హైదరాబాద్,అక్టోబర్ 5 :** తెలంగాణ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం అందించాలని ఆయన కోరారు. గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న 'చింతన్ శివిర్' --2026 కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.ఎల్బీనగర్–హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వెంటనే మంజూరు చేయాలని కేంద్రమంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్–65, 6ం2 లేన్ల విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర--దక్షిణ భాగాలు, హైదరా బాద్--అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే అంశాలపై చర్చించా రు. హైదరాబాద్--శ్రీశైలం ఎన్‌హెచ్ -765పై ఎలివేటెడ్ కారిడార్ కోసం విజ్ఞప్తి చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మి మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్‌హెచ్ -65లో ఎల్‌బీనగర్--మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు (6ం2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్ఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని నితిన్ గడ్కరీకి కోమటిరెడ్డి వివరించారు. మియాపూర్ -- ఎల్బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026--27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వా లని విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగా ర్జునసాగర్–నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించి నట్లు తెలిపారు.తెలంగాణ-- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం ఎన్‌హెచ్ - 65ను ఆరు(6ం2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సీఆర్ఐ ఎఫ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మొత్తం 511.68 కి.మి. పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల



అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 2026--27 సీఆర్.ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సంగారెడ్డి–నర్సాపూర్--తూప్రాన్–గజ్వేల్–జగదేవ్‌పూర్–భువనగిరి--చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న త్రిబుల్ ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, ఎన్.హెచ్.ఏఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు.

# అర్హుల ఓటు చేజారనివ్వం

**న్యూఢిల్లీ,అక్టోబర్ 5 :**తెలంగాణలో అర్హులైన ఏ ఒక్కరి ఓటునూ చేజారనివ్వ బోమని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఓట్లు గల్లంతైన బాధితులను ఏకం చేసి ఓటర్ల హక్కుల పరిరక్షణకు ఉద్యమం చేపడతామని తెలిపారు. రాబోయే రెండు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఓటు పరిరక్షణ ఉద్యమాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు, ఓట్ల తొలగింపుపై సోమవారం ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ అగ్రనేతల సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి పీసీసీ స్థాయి వరకు ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయిం చినట్లు చెప్పారు.ప్రజా సంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు పీసీసీ తరఫున లేఖలు రాసి ఓటర్ల హక్కుల పరిరక్షణకు సహకరించాలని కోరనున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవ కలకు కేంద్ర ఎన్నికల సంఘమే బాధ్యత వహించాలని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్ పేరుతో దాదాపు 92 లక్షల ఓట్లు తొలగించారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా స్థాయి నిరసన ర్యాలీలు, 8న 'చలో రాజ్‌భవన్' కార్యక్రమం నిర్వహించను న్నట్లువెల్లడించారు. ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని అన్నారు.

# మహిళలపై నేరాలను అరికట్టండి

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. నేరం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, నేరాలు జరగకుండా నివారించడమే అత్యంత ముఖ్యమని ఢిల్లీ పోలీసులకు హితవు పలికింది. ఇటీవల ఢిల్లీ–జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో వరుసగా చోటుచేసుకున్న అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా పోలీసుల పనితీరుపై పలు సూచనలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ పార్థీవాలా మాట్లాడుతూ.. "మహిళలపై దాడులకు పాల్పడాలనుకునే దుండగులకు తాము పట్టుబడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం ఉండాలి. అలాంటి వాతావరణాన్ని మీరు కల్పించాలి" అని పోలీసులను ఆదేశించారు. నేరాలను అరికట్టేందుకు నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా న్యాయస్థానం నొక్కి చెప్పింది. ఢిల్లీలో మహిళల భద్రతకు సంబంధించి పలు నిర్దిష్ట ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో బీట్ పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, వెలుతురు సరిగా లేని ప్రదేశాలను గుర్తించి వెంటనే లైటింగ్ సౌకర్యం మెరుగుపరచాలని సూచించింది. అలాగే, నిఘా వ్యవస్థలను పటిష్ఠం చేయాలని తెలిపింది. దుండగులు, పోకిరీలు ఎక్కువగా గుమికూడే అక్రమ తినుబండారాల కేంద్రాలు, మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ముఖ్యంగా విద్యాసంస్థల సమీపంలో అమ్మాయిలను వేధించే వారిపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేసింది. దేశ రాజధాని పరిధిలో మైనర్లపై జరిగిన లైంగిక దాడులతో సహా వరుస అత్యాచార ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో కూడా కోర్టు మహిళల భద్రతపై ఆడిట్ నిర్వహించాలని, ఇతర తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా విచారణలో తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఢిల్లీ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది.

# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# రేవంత్ సర్కార్ కుట్రలు



**హైదరాబాద్,అక్టోబర్ 5 :** రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్ లో ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బోనస్

(మొదటి పేజీ తరువాయి)

కాదని, తెలంగాణకు కొంగు బంగారంగా, లక్షలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధితో పాటు తెలంగాణ అభివృద్ధిలో సింగరేణి కీలక భాగస్వామిగా కొనసాగుతోందని పేర్కొన్నారు.సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు సింగరేణి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కిషన్‌రెడ్డి కోరారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# సింగరేణి కార్మికుల సమస్యలు రెండు నెలల్లో పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న అలియాస్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. విజిలెన్స్ కారణంగా పెండింగ్‌లో ఉన్న ఆధారిత ఉద్యోగాల కేసులను పరిష్కరించాలని, ప్రతి కార్మికుడికి సొంత ఇంటి పథకం కింద రెండు గుంటల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించాలని, కార్మికులకు ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని, హైపవర్ కమిటీ సిఫార్సుల మేరకు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించాలని కవిత కోరారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

ప్రజా అక్షర న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

# వివాదాలకు మారు పేరుగా దౌల్తాబాద్ షాపింగ్ కాంప్లెక్స్!

- లక్షల్లో కిరాయి బకాయిలు.. పూర్తయినా అందుబాటులోకి రాని దుకాణాలు
- రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు పూర్తి..
- ఆరు నెలలుగా నిరుపయోగం
- స్వాధీనం చేసుకోవడంలో జాప్యంపై స్థానికుల విమర్శలు
- ప్రైవేటు భవన యజమానులకు మేలు చేసేందుకేనా? అంటూ అనుమానాలు





**దౌల్తాబాద్,అక్టోబర్ 5(ప్రజా అక్షరం ):**
దౌల్తాబాద్ మండల కేంద్రంలోని షాపింగ్ కాంప్లెక్స్ వివాదాలకు మారు పేరుగా మారుతోంది. ఒకవైపు గతంలో దుకాణాల కిరాయికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయినట్లు ఆరోపణలు ఉండగా. మరోవైపు అసంపూర్తిగా ఉన్న భవనానికి రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు పూర్తి చేసినా, ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిధులతో నిర్మాణ పనులు పూర్తి చేసి ఆరు నెలలు గడుస్తున్నా భవనం నిరుపయోగంగా ఉండటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**నిధులు వెచ్చించినా ఉపయోగం శూన్యం**
దౌల్తాబాద్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గతంలో అసంపూర్తిగా ఉండేది. భవనాన్ని పూర్తిచేసేందుకు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి సుమారు రూ.10 లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తయి ఆరు నెలలు దాటినప్పటికీ.. దుకాణాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. దీంతో ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు.

**కిరాయిల బకాయిలు.. ఆదాయానికి గండి**
ఇప్పటికే షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించిన దుకాణాల కిరాయిల విషయంలో కూడా పలు సమస్యలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గతంలో దుకాణాలను అద్దెకు తీసుకున్న కొందరి నుంచి లక్షల రూపాయల మేర కిరాయి బకాయిలు రావాల్సి ఉందనే చర్చ ఉంది. పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సిన వాణిజ్య సముదాయం నుంచే బకాయిలు పేరుకుపోవడం. కొత్త భవనం పూర్తయినా వినియోగంలోకి రాకపోవడం పంచాయతీ నిర్వహణ తీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం ఎప్పుడు?**
షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తయిన నేపథ్యంలో సం బంధిత శాఖ నుంచి గ్రామ పంచాయతీ భవనాన్ని స్వాధీనం తీసు కుని, దుకాణాలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అయితే ఆ ప్రక్రియ పూర్తికాకపోవడంతో భవనం వినియో గంలోకి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా. సంబంధిత అధికారులు సమన్వ యంతో చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పంచాయతీకి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాం**
ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ రామ్‌కుమార్‌ను వివరణ కోరగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, గ్రామ పంచాయతీకి అప్పగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీంతో భవనాన్ని స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత పంచాయతీపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**జాప్యానికి కారణమేంటి?**
నిర్మాణం పూర్తయిన భవనాన్ని పంచాయతీ ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భవనం అందుబాటులోకి వస్తే పంచాయతీకి దుకాణాల ద్వారా క్రమం తప్పకుండా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ ప్రక్రియలో జాప్యం ఎందుకు జరుగుతోందో అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

**ప్రైవేటు భవన యజమానులకు మేలు చేసేందుకేనా?**
షాపింగ్ కాంప్లెక్స్ వినియోగంలోకి వస్తే స్థానికంగా అద్దె దుకాణాల లభ్యత పెరిగి, ప్రైవేటు భవనాల్లో దుకాణాలకు డిమాండ్ తగ్గే అవకాశం ఉందని కొందరు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే పంచాయతీ కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా భవనాన్ని పంచాయతీరాజ్ శాఖ నుంచి స్వాధీనం చేసుకోవడంలో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత పంచాయతీ అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంది.

**ప్రజాధనం పంచాయతీ ఆదాయం.. ఎవరి బాధ్యత?**
ప్రభుత్వ నిధులతో పనులు పూర్తి చేసిన భవనం నెలల తరబడి నిరుపయోగంగా ఉండటం వల్ల ఒకవైపు ప్రజాధనం వృథా అవుతుండగా.. మరోవైపు పంచాయతీకి రావాల్సిన ఆదాయం కూడా కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. షాపింగ్ కాంప్లెక్స్‌ను వెంటనే పంచాయతీ ఆధీనంలోకి తీసుకుని, నిబంధనల ప్రకారం దుకాణాలను కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. భవనం అప్పగింతలో జాప్యానికి అసలు కారణమేంటి? గతంలో పేరుకుపోయిన కిరాయి బకాయిల వసూళ్ల పరిస్థితి ఏమిటి? కొత్త దుకాణాలను ఏ నిబంధనల ప్రకారం కేటాయించనున్నారు? పంచాయతీకి సమకూర్చాల్సిన ఆదాయంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# గాజులపల్లి పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ పంజ స్వామి సహకారం.

- బోర్ మరమ్మతుకు స్వయంగా శ్రమించిన గ్రామ ప్రథమ పౌరుడు.



**దౌల్తాబాద్ అక్టోబర్ 5(ప్రజా అక్షరం )**
దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి గ్రామ సర్పంచ్ పంజ స్వామి గ్రామాభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య తలెత్తిందని ప్రధానోపాధ్యాయుడు త్యాగరాజు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు.గ్రామ ప్రథమ పౌరుడిగా ఉన్నప్పటికీ శ్రమజీవిగా ముందుకొచ్చి తల్లిదండ్రులతో కలిసి బోర్ మరమ్మతు పనుల్లో స్వయంగా పాల్గొని సమస్య పరిష్కారానికి కృషి చేశారు. పాత బోరు స్థానంలో నూతన బోర్ మోటార్‌ను ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య తీరనుం ది.అదేవిధంగా గతంలోనూ సర్పంచ్ పంజ స్వామి పాఠశాల అభివృద్ధికి సహకరించారు. పాఠశాల గోడలకు రంగురంగుల చిత్రాలతో పెయింటింగ్ వేయించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిం చారు. విద్యార్థుల సౌకర్యాలు, పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న సర్పంచ్ పంజ స్వామికి ప్రధానోపాధ్యాయుడు త్యాగరాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలి



**తుర్కపల్లి, అక్టోబర్ 05 ప్రజా అక్షరం న్యూస్**
ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని మండల మహిళా కూలీలు అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇచ్చిన ప్రజావాణిలో మండల నోడల్ అధికారి, ఎంపీడీవో లింకల గీతారెడ్డికి దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 -25 సంవత్సర మధ్యకాలంలో కనీసం 20 రోజులు ఉపాధి పనిచేసి గుంట భూమిలేని కూలీలకు సంవత్సరానికి 12,000 రెండు దఫాలుగా కూలీల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం గుర్తించింది కానీ, ఈ పథకం ఇప్పటివరకు పేద కూలీలకు అమలు చేయడం లేదన్నారు. రైతు భరోసా రైతు బీమా క్రాప్ట్ లోన్ వంటి సహాయం కూడా భూమి ఉన్న వారికే అన్ని అవకాశాలు అందుతున్నాయని, ప్రభుత్వం వెంటనే ఈ భూమిలేని కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కూలీలు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించిన మండల పరిషత్ అధికారి జలంధర్ రెడ్డి



**ప్రజా అక్షరంవలిగొండ అక్టోబర్ 5**
మండల ప్రజా పరిషత్ కార్యాలయం, వలిగొండలో సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరై, ప్రజల నుంచి సమస్యలు మరియు వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 3 దరఖాస్తులు స్వీకరించామనిప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

# రమణేశ్వరంలో వైభవంగా 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' గ్రంథావిష్కరణ





**ప్రజా అక్షరం భువనగిరి ప్రతినిధి అక్టోబర్5**
సకల ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా నిలిచేదే నిజమైన సనాతన ధర్మమని సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రమణేశ్వరంలో ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంలో సోమవారం 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' గ్రంథావిష్కరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు, మఠాధిపతులు, మహామండలేశ్వరులు, ఆశ్రమాధిపతులు కార్యక్రమానికి హాజరయ్యారు. శాసనమండలి సభ్యుడు అద్దంకి దయాకర్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ఆధ్యాత్మికవేత్త చెన్నప్ప తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి మాట్లాడుతూ వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తుల పరమార్థమే సనాతన ధర్మమని వివరించారు. మానవాళికి సనాతన ధర్మ తాత్వికతను సులభంగా అందించాలనే ఉద్దేశంతో గ్రంథాన్ని సంస్కృతంలో రచించినట్లు తెలిపారు. సామాన్యులకు సైతం అర్థమయ్యేలా తెలుగు తాత్పర్యంతో పాటు వివరణను పొందుపరిచినట్లు చెప్పారు. గ్రంథంలోని ముఖ్యమైన తొమ్మిది దివ్య సూత్రాలను భక్తులకు స్వయంగా వివరించారు.సనాతన ధర్మంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ గ్రంథం మార్గదర్శకంగా నిలుస్తుందని కార్యక్రమానికి హాజరైన జగద్గురువులు, పీఠాధిపతులు పేర్కొన్నారు. సనాతన ధర్మం అనాదిగా కొనసాగుతున్నదని, అంతర్ముఖ సాధన, ఆత్మజ్ఞానం, దైవానుభూతి ద్వారా ఆత్మలోని దైవత్వాన్ని దర్శించడమే ధర్మసారమని వారు వివరించారు.సనాతన ధర్మం అనాది, విశ్వవ్యాప్తమని పేర్కొంటూ.. మూల దైవం శివుడు, మూల శాస్త్రం వేదం, మూల సిద్ధాంతం అద్వైతం, మూల గురువు సదాశివుడు, మూల సాధనం ధ్యానం, లక్ష్యం ఆత్మసాక్షాత్కారం, ఆరాధించాల్సిన గురువు సిద్ధగురువు వంటి అంశాలను శ్రీ రమణానంద మహర్షి వివరించారు.ఆధ్యాత్మిక ప్రముఖులకు పూర్ణకుంభంతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా బంగారు శివలింగానికి విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం అతిథులు జ్యోతిర్మండల ఆలయంలోని నక్షత్ర, నవగ్రహ, రాశ్యాత్మక దేవతలను దర్శించుకున్నారు. అనంతరం జగద్గురువులు, పీఠాధిపతుల సమక్షంలో శ్రీ రమణానంద మహర్షి సంస్కృతంలో రచించిన 'సనాతన ధర్మ సహస్ర సూత్రాలు' గ్రంథాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రముఖులను సత్కరించారు. 1008 సంస్కృత సూత్రాలతో రూపొందించిన గ్రంథ రచనను అతిథులు అభినందించి రచయిత శ్రీ రమణానంద మహర్షికి ఆశీస్సులు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు మహోత్సవంలో అన్నదానం నిర్వహించారు. ధర్మబోధలు, ఆధ్యాత్మిక సందేశాలు, సంప్రదాయ సత్కారాల నడుమ గ్రంథావిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



ప్రజా అక్షరం న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

# రోడ్లు చిరకాలం మన్నికగా ఉండేలా నాణ్యతతో నిర్మించాలి

**:- నగర మేయర్ మహంకాళి స్వామి**



ప్రజా అక్షరం,రామగుండం (ప్రతినిధి) అక్టోబర్ 5:- రోడ్లు చిరకాలం మన్నికగా ఉండేలా నాణ్యతలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.నలభయ్ ఏడవ డివిజన్ కేశవ నగర్ లో స్థానిక కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డి ఎం ఎఫ్ టి నిధులు రూ 30.00 లక్షల అంచనా వ్యయంతో టి సి సి రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాము పర్యటించినప్పుడు ఇక్కడి దుర్భర పరిస్థితులను గమనించి ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని అన్నారు. ఆయన వెంటనే రూ 50.00 కోట్లు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించామని అన్నారు . మరో ఆరు నెలలలో ఈ ప్రాంతశీలో మౌళిక వసతులకు సంబందించి ఏ సమస్యా లేకుండా పరిష్కరిస్తామని,కేశవ నగర్ లో నీటి ప్రెజర్ తక్కువగా ఉన్న విషయం తమ దృష్టికి వచ్చిందని కొత్త పైప్ లైన్లు వేసి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముస్తఫా,చిదురాల నాగరాజు, నగర పాలక సంస్థ ఎఇ మీర్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం ప్రభుత్వ ఆసుపత్రి లో అధికారుల నిర్లక్ష్యం

**:- పేదలకు అందని సరైన వైద్యం**



ప్రజా అక్షరం,రామగుండం (ప్రతినిధి), అక్టోబర్ 5 :- రామగుండం నియోజకవర్గ ప్రజలకు మెరుగైన,ఉచిత వైద్యం అందాలనే తపనతో స్థానిక శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ హైద్రాబాద్ వెళ్లి ముఖ్యమంత్రి, మంత్రుల ఆపీసు ల చుట్టూ రాత్రిం బవళ్లు అహర్నిశలు కష్టపడి రాష్ట్ర ప్రభుత్వం నుండి భారీగా నిధులు తీసుకువస్తుంటే,ఇక్కడి రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి జి హెచ్ ) అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం వల్ల పేద ప్రజలకు సరైన వైద్యం మరియు మందులు అందడం లేదని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు మడిపెల్లి మల్లేష్ తీవ్రంగా మండిపడ్డారు.ఆసుపత్రిలో ప్యాన్ లు సరిగా పని చేయడం లేదని ఎమర్జెన్సీ వార్డు లో వెంటిలేషన్ లేక ఉక్కపోత తో పేసెంట్ లు అవస్తలు పడుతున్నారని శానిటేషన్ (పరిశుభ్రత) అధ్వానంగా తయారైందని,ఎక్స్ రే,స్కానింగ్ లు మిషినరీలు ఉన్నా పని చేయవని,రోగులకు సరైన వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వీరి నిర్లక్ష్యం తో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారికి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన పేర్కొన్నారు.ఆసుపత్రిలో జరుగుతున్న నిర్లక్ష్యం అవకతవకలను బయటపెట్టేందుకు సోమవారం రోజున ఆర్ టి ఐ ద్వారా దరఖాస్తు చేసి,ఈ క్రింది కీలక విషయాలపై సమాచారం కోరినట్లు మడిపెల్లి మల్లేష్ తెలిపారు.ఆరోగ్యశ్రీ నిధుల వివరాలు:- 2020 నుండి 2025 వరకు జిజిహెచ్ రామగుండంకు వచ్చిన ఆరోగ్యశ్రీ నిధులు ఎంత? వాటి ఖర్చులకు హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ తీర్మానాలు చేశారా లేదా? మందుల కొనుగోలు 2021 నుండి 2025 వరకు లోకల్ పరిచేజ్ ద్వారా కొనుగోలు చేసిన మందులకు గాను ప్రభుత్వ సరఫరా లేదనే 'నాన్-అవైలబిలిటీ సర్టిఫికెట్' తీసుకున్నారా? టెండర్ విధానం మరియు డిస్ట్రిక్ట్ పరిచేజ్ కమిటీ అనుమతులు.సర్జికల్ పరికరాల వివరాలు:- ఆసుపత్రిలోని సర్జరీ విభాగంలో ల్యాప్రోస్కోపిక్ సర్జికల్ పరికరాలు ఉన్నాయా? వాటిని ఏ కంపెనీ నుండి కొనుగోలు చేశారు.2020-2025 మధ్య ఆర్థోపెడిక్ విభాగంలో రోగులకు వాడిన ఇంప్లాంట్లు ఏ కంపెనీ నుండి కొనుగోలు చేశారు.కమిటీ ఆమోదించిన జాబితా ఉందా?శానిటేషన్,పేషెంట్ కేర్,సెక్యూరిటీ గార్డుల కాంట్రాక్టర్లు ఎవరు?ఎంతమంది పనిచేస్తున్నారు? వారి జీతభత్యాల పే-రోల్ వాటి వివరాలు ఏమిటి.ఈ వివరాలు బయటపడితే తమ అక్రమాలు గుట్టు రట్టవుతాయనే భయంతో ఆసుపత్రి అధికారులు తనపై దాడులు చేయించడం గానీ,లేదా తప్పుడు కేసులు బనాయించే అవకాశం ఉందని పేద ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్తానని ప్రాణాలు పోయినా సిద్ధంగా ఉన్నానని మడిపెల్లి మల్లేష్ తెలిపారు. ఎమ్మెల్యే అహర్నిశలు శ్రమించి రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు తెస్తుంటే,వాటిని సద్వినియోగం చేయకుండా పేద రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ కఠిన చర్యలు తీసుకోవాలని మడిపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు.

# అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం



రాజన్న సిరిసిల్ల జిల్లా/ గంభీరావుపేట/అక్టోబర్ 5 (ప్రజా అక్షరం) గంభీరావుపేట మండలం కోలమద్ది గ్రామానికి చెందిన నారాయణ అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్ట్ కుటుంబానికి తోటి జర్నలిస్టులు ఆర్థిక సాయం చేశారు.ఇటీవల మృతి చెందిన ఏడబోయిన నారాయణ కుటుంబానికి మండల టీయూ డబ్ల్యూ జె ఐజెయూ జర్నలిస్ట్ మిత్రులు ఆర్థిక సహాయం అందించారు.మృతి చెందిన జర్నలిస్ట్ కుటుంబానికి ఆదుకోవడానికి మండల జర్నలిస్టులు అందరు కలిసిసేకరించిన రూ.10వేల నగదును నారాయణ భార్య సరితకు అందించారు.ఈ కార్యక్రమం లో ఐజె యూ మండల అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ జర్నలిస్ట్ శంకర్ లు ఉన్నారు.

# ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

**●ఓబీసీ ఆత్మీయ సమ్మేళనంలో నేషనల్ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్**



హైదరాబాద్ అక్టోబర్ 05 ప్రజా అక్షరం బీసీలకు శాసన మండలి ఎన్నికల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలు ముందుకు రావాలని నేషనల్ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ కోఆర్డినేషన్ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు.నేషనల్ బీసీ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలుగా బలహీన వర్గాలు సామాజిక, రాజకీయంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ప్రత్యేకంగా మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించే విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా వరంగల్--ఖమ్మం--నల్గొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి కేటాయించే అంశాన్ని కూడా రాజకీయ పార్టీలు పరిశీలించాలని దుండ్ర కుమారస్వామి కోరారు.ఎన్నికల సమయంలో బీసీ, ఎస్సీ వర్గాల మద్దతు కోరడమే కాకుండా, శాసన నిర్ణయాలు తీసుకునే వేదికల్లోనూ ఆయా వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. "ప్రాతినిధ్యం కేవలం రాజకీయ అవకాశం కాదు.. అది సామాజిక న్యాయానికి కొలమా నం" అని దుండ్ర కుమారస్వామి పేర్కొన్నా రు. వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే అంశంపై విస్తృతంగా చర్చించి, చారిత్రాత్మకంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించేలా నిర్ణయాలు తీసుకోవాలని రాజకీయ పార్టీలను కోరారు.ఈ కార్యక్రమంలో నేషనల్ బీసీ దళ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజేష్ యాదవ్, నేషనల్ బీసీ దళ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

# నేడు ఉచిత మెగా వైద్య శిబిరం



ప్రజా అక్షరం,రామగుండం (ప్రతినిధి) అక్టోబర్ 5 :- సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్,రామగుండం ఏరియా-1 పరిధిలోని సుందిళ్ల గ్రామంలో అక్టోబర్ 6న మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏరియా ఆసుపత్రి అధికారులు తెలిపారు.ఆర్జి-1 జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ ఆదేశాల మేరకు మరియు అడిషనల్ సీఎంఓ (అడ్మిన్) పర్యవేక్షణలో రామగుండం ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నారు.ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు బీపీ, షుగర్,సాధారణ వైద్య పరీక్షలు నిపుణులైన వైద్యులచే ఉచిత సంప్రదింపులు,సలహాలు అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ కార్యక్రమం సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా సుందిళ్ళ గ్రామా ప్రజల ఆరోగ్యం కోసం ఈ శిబిరాన్ని నిర్వహించబడును. కావున సుందిళ్ళ గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ 1 జీఎం డి.లలిత్ కుమార్ తెలిపారు.

# ఐటిఐ విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు



ప్రజా అక్షరం,పెద్దపల్లి (ప్రతినిధి), అక్టోబర్ 5 :- రామగుండం సిపి ఆదేశాల మేరకు షీ టీమ్ ఇంచార్జి ఎస్ఐ ఎం.లావణ్య ఆధ్వర్యంలో పెద్దపెల్లి షీ టీమ్, పెద్దపెల్లి,శాంతి నగర్ లోని సింధూర ఐటిఐ కాలేజీ విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు.అందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి,పోక్సో యాక్ట్,సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియమావళి గురించి తెలిపారు.టీనేజ్ ఏజ్ లొ జరిగే మార్పులు,మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు.ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్,ప్రధాన చౌరస్తాలో,జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని,అలాగే అన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ,మహిళలకు ప్రయాణ సమయంలొ ట్రావెలింగ్ సేఫ్టీ అప్ ు- ఝుటవ యాప్ వాడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలొ కరస్పాండెంట్ రజిత,చైర్మన్ రోహిత్, ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ సభ్యులు,మౌనిక,సురేష్ పాల్గొన్నారు.

# ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుకు స్పందన



రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/అక్టోబర్5 (ప్రజా అక్షరం) ముస్తఫానగర్ గ్రామ అభివృద్ధిలో భాగంగా గ్రామస్తులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు గంభీరావుపేట మండల తహసిల్దార్ స్పందించి ఆర్ఐ ని జిపిఓ ని స్థల పరిశీలనకు పంపడం జరిగింది గ్రామ శివారులో బతుకమ్మ ఘాట్ ఆటస్థలం పరిశీలించిన ఆర్ ఐ మరియు జి పి ఓ లు సానుకూలంగా స్పందించారు.ఇట్టి పరిశీలన కార్యక్రమంలో ముస్తఫానగర్ బతుకమ్మ జాగృతి సంస్థ అధ్యక్షులు శ్రీ గౌరీ నాగరాజు గౌడ్.వార్డు సభ్యులు దోమకొండ కృష్ణకాంత్ యాదవ్.ముస్తఫనగర్, మాజీ వార్డ్ మెంబర్ల ఫోరం అధ్యక్షుడు బండ రమేష్,మరియు సభ్యులు కుడుకల తిరుపతి.మరియు బండ రవికుమార్.తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు బియ్యం పంపిణీ

**బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ**



రాజాపేట: అక్టోబర్ 5 (ప్రజా అక్షరం): రాజపేట మండలం లోని చల్లూరు గ్రామంలో ఇటీవల మరణించినా మహేశ్వరం నరహరి, కడవేరుగు బిక్షపతి, మహేశ్వరం నరసయ్య,మద్ది జనార్దన్,గుంటి విజయ,సట్టా రాములు కుటుంబాలకు గ్రామ శాఖ అధ్యక్షులు శాగ నవీన్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 50 కేజీల చొప్పున బియ్యాన్ని సోమవారం పంపిణీ చేశారు.ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలన్న ఆదేశాల మేరకు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లూరు గ్రామ సర్పంచ్ రూప బాల్ నర్సయ్య ఉప సర్పంచ్ బొంత సుధాకర్, పిఎసిఎస్ డైరెక్టర్ చిట్కూరి గౌరయ్య, మునిగడప కనకయ్య, బడే ఎల్లయ్య వార్డ్ మెంబర్ గణపురం శ్రీకాంత్, మహేశ్వరం సుధాకర్ భీమ గాని కృష్ణ పెంట శ్రీహరి, కొండపాక మధు, గుంటి శ్రీరాములు, మీసా కృష్ణ, చాడ బంగారి, గణపురం మార్కండేయ, సిదారపు మహేందర్ కోల కనకయ్య వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అక్షర న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

# దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్





భువనగిరి అక్టోబర్ 5 (ప్రజా అక్షరం):
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా వాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 131 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు.అందులో రెవిన్యూ శాఖ 73, సర్వే ల్యాండ్స్ 12, మున్సిపాలిటీ 10, వ్యవసాయ 6, జిల్లా పరిష త్ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 4, విద్య శాఖ 3, గ్రామీణ అభివృద్ధి 2, పంచాయతీరాజ్ 2, ఉపాధి కల్పన 2, అటవీ 2, పంచాయతీ 2, మైన్స్, వైద్య ఆరోగ్య, పౌరసరఫరాల, ఇరిగేషన్, లేబర్, సమాచార శాఖ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, బీసీ వెల్ఫేర్, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి



అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న విగ్రహాకి విరాళాలు సేకరణ



రాజాపేట,అక్టోబర్ 5(ప్రజా అక్షరం):
రాజాపేట మండలం కుర్రారం గ్రామంలో పండుగ సాయన్న విగ్రహ కమిటీ సోమవారం ముదిరాజ్ కులస్తులను కలిశారు పండుగ సాయన్న విగ్రహం గురించి చర్చించి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ అధ్యక్షులు పులి చంద్రమౌళి విగ్రహ కమిటీ అధ్యక్షులు శివరాములు, నేమిల సర్పంచ్ పులి రాజు,పిట్టల జయరాం,చెరుకు కనకయ్య రెడ్డబోయిన రాజు, యామ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అధ్యక్షుని కలిసిన రాజపేట సేవాదళ్ కన్వీనర్




రాజాపేట అక్టోబర్ 5 (ప్రజా అక్షరం): రాజాపేట మండలం తెలంగాణ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు గొడిసెల నగేష్ కు రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ సోమవారం ధ్రువీకరణ పత్రం అందజేశారు. గాంధీ భవన్ లో తెలంగాణ కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర అధ్యక్షుడు ని మర్యాదపూర్వకంగా కలిసిన రాజపేట సేవాదల్ మండల అధ్యక్షుడు గొడిశెల నగేష్ కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సేవాదల్ నాయకులు, పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పాట చిత్రీకరణ



రఘునాథపల్లి అక్టోబర్ 5(ప్రజా అక్షరం): జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం,కిల్లషాపూరంలో గ్రామం లో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పాట చిత్రీకరణలో తెలంగాణ రాష్ట్ర గౌడ యువజన సంఘం అధ్యక్షుడు ఘనగని మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ సర్దాయి సర్వాయి పాపన్న,మొఘల్ పాలకుల అరాచకాలను ఎదిరిస్తూ, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాటం చేసిన యోధుడు సర్థార్ సర్వాయి పాపన్న గౌడ్. ఒక సామాన్యుడైన వ్యక్తి గొప్ప పరాక్రమవంతుడిగా ఎదిగిన అద్భుత గాథ ఆయనది. ఈ చర్య అణగారిన వర్గాలకు అతిపెద్ద ఆశాజ్యోతిగా, గొప్ప ప్రేరణగా ఆనాడు నిలిచింది. పోరాట యోధుడే కాదు,బహుజన నాయకుడిగా పాపన్న గౌడ .చేసిన ఆనాటి త్యాగాలని ప్రతి పౌరుడు తెలుసు కోవాలి అని అన్నారు.

# మలేరియాపై అప్రమత్తం



సాలూరు, అక్టోబరు5:
రాష్ట్రస్థాయి మలేరియా బృందం సోమవారం రెండోరోజు సాలూరులో పర్యటించింది. రాష్ట్ర సంచాలకులు వీర్రాజు, కన్సల్టెంట్ రామచంద్ర, జోనల్ కార్యా లయ సహాయ సంచాలకులు మనోరమ తదితరులు ముందుగా సాలూరు ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. మలేరియా, డెంగ్యూ కేసుల నమోదు, సీజనల్ వ్యాధుల పరిస్థితిని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మలేరియా కేసులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించి.. రోగులకు సకాలంలో మందులు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం తోణాం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మలేరియాతో బాధపడుతున్న పిల్లల వివరాలు, వారికి మందులు అందుతున్న తీరు, డార్మెటరీలో దోమతెరల వినియోగంపై వాకబు చేశారు. తర్వాత పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి.. అవసరమైన సలహాలు ఇచ్చారు. తోణాం గ్రామస్థులకు దోమతెరలు వాడే విధానంపై అవగాహన కల్పించారు. వారి వెంట జిల్లా మలేరియా అధికారి సూర్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి ఈశ్వరరావు, ఆదినారాయణ, వైద్యాధికారి మధుసూదనరావు తదితరులు ఉన్నారు.

# బెల్ట్ షాపులు మూసివేయాలని ఫిర్యాదు



రాజాపేట అక్టోబర్ 5(ప్రజా అక్షరం):
బెల్ట్ షాపులను మూసివేయాలని పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. రాజాపేట మండలం నెమిల మదిర గ్రామమైన పిట్టలగూడెంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తుండడంతో గ్రామంలో భార్య భర్తల మధ్య తండ్రి కొడుకుల మధ్య యువకుల మధ్య మద్యానికి బానిసైన వారి వలన గొడవలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి వేళల్లో మహిళలు బయటకు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వెంటనే అధికారులు పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి కి, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి బెల్ట్ షాపుల మూసివేతకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రవి, కవిత, పెంటమ్మ,అనిత, కనక లక్ష్మి, పూలమ్మ, కళావతి, సరోజ, గౌరమ్మ,పెంటమ్మ, చంద్రకళ, బొంబాయి, పవిత్ర,రాజమ్మ, చిలకమ్మా, అనూష, చెట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయానికి కోడె దూడను అందజేసిన కడవేర్గు శ్రీశైలం



రాజాపేట అక్టోబర్ 5(ప్రజా అక్షరం) రాజాపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రైతు కడవేరు శ్రీశైలం తన వ్యవసాయ భాయి వద్ద అతి ప్రేమగా పెంచుకుంటున్న కోడెదూడను సోమవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి అప్పగించారు. కుటుంబ సభ్యులతో సహా శ్రీ స్వామివారిని దర్శించుకుందాం అనంతరం ఆలయ అధికారులకు కోడెదూడ ను అప్పగించగా ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. అతి ప్రేమగా సాదుకున్న ఓకే దూడను ఆలయానికి అప్పజెప్పినట్లు కడవెరిగి శ్రీశైలం చెప్పారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి



ఆసిఫాబాద్, అక్టోబరు 5 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని రెవె న్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లాకేంద్రం లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని రెవెన్యూ, గృహనిర్మాణశాఖలపై జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ కలెక్టర్లు, ఐటీడీఏ పీవో మంద మకరందు పాల్గొని ఆయా జిల్లాలోని రెవెన్యూ, గృహనిర్మాణశాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్ర మాలు, ప్రజలకు అందుతున్న సేవలు మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబం ధించిన పెండింగ్ దరఖాస్తులు, భూసమస్యలు, ధర ణి, భూరికార్డుల అంశాలు, పట్టాదార్ పాస్ పుస్త కాలు, భూహక్కులు తదితర దరఖాస్తుల పరిష్కా రంపై ప్రత్యేకదృష్టిపెట్టాలని అధికారులను ఆదేశిం చారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా నిర్ణీతగడువులోగా దరఖాస్తులను పరిష్క రించాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా అధికారులు సమన్వ యంతో పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణంలో అటవీ సమస్యలుంటే సంబంధితశాఖల అధికారులు కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటికలను సాకారం చేయ డమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో ఆసిఫా బాద్ కలెక్టర్ హరిత, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్, రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హన్మంతు, గృహనిర్మాణ ప్రత్యేక కార్యదర్శి గౌతం, ఎమ్మెల్యే దండెవిఠల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్‌బాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సేవ, ఆపన్న హస్తానికి పట్టం.

## రెడ్ క్రాస్ సొసైటీ డైరెక్టర్ గా మేక వెంకటేశ్వర్లు రెడ్డి ఎన్నిక




రాజాపేట, అక్టోబర్ 5(ప్రజా అక్షరం):
రాజాపేట మండలం నమిల గ్రామానికి చెందిన సేవా సంపన్నులు మేక వెంకటేశ్వర్లు రెడ్డి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. 15 సభ్యులకు గాను ఎక్కువమంది నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికలు అనివార్యం అయ్యాయి. దీంతో 4వ తేదీ జరిగిన పోలింగ్ రాత్రి ఫలితాల వెల్లడి తర్వాత మేక వెంకటేశ్వర్లు రెడ్డి ఎన్నికల కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సేవకు పట్టం కట్టారని మండల ప్రజలు నాయకులు జర్నలిస్టులు అభిప్రాయం వ్యక్తం చేశారు. 30 సంవత్సరాల నుండి ప్రాజెక్టు మండల నమిల గ్రామస్తులకు సేవలు అందించడంతోపాటు, అంతిమయాత్రలో పాల్గొనడం, రక్తదానాలు, అనారోగ్యం పాలైన ఆకస్మిక ప్రమాదాలకు గురైన వ్యక్తులను ఆస్పత్రులకు తరలించి సాయం అందించడం లాంటి అనేక కార్యక్రమాలను చేపట్టిన వెంకటేశ్వర్లు రెడ్డి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రశంస పత్రం అవార్డు అందుకని ప్రభుత్వ అధికారులచే మన్ననలు పొందారు. అందరివాడుగా ఆపదలో ఆపన్న హస్తం అందిస్తూ పేద సామాన్య ప్రజల అభిమానాలు ఆశీర్వాదాలు చూరగొన్న వెంకటేశ్వర్లు రెడ్డి కి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా డైరెక్టర్ గా ఎన్నుకున్న ఓటర్లకు రాజాపేట మండల వాసులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మేక వెంకటేశ్వర్లు రెడ్డిని ప్రత్యక్షంగా, సోషల్ మీడియా ద్వారా ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజా అక్షర న్యూస్
TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

# సన్న బియ్యం ధరలపై హరీశ్ ఫైర్..
# నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయంటూ విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 5:** రాష్ట్రంలో నిత్యావసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ధరల పెరుగుదలతో సామాన్యుడిపై పెను భారం పడుతోందన్నారు. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. ఉత్పత్తి పెరిగితే బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్నంటుతున్నాయని మాజీ మంత్రి ప్రశ్నించారు.'సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి .. రేవంత్ సర్కార్ నేల చూపులు చేస్తోంది. నిత్యవసర ధరల నియంత్రణపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసింది. సామాన్యుడిపై పెనుభారం పడుతుంటే పౌరసరఫరాల శాఖ మొద్దు నిద్రలో ఉంది. వెంటనే ధరల పెరుగుదలపై సమీక్ష నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలి. నిత్యావసరాల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తుంటే.. ధరలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం దారుణం. ప్రభుత్వ నిర్లక్ష్యం, పర్యవేక్షణ వైఫల్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారు. సన్నబియ్యం ధరలు కేవలం నాలుగు నెలల్లోనే 25 శాతం పెరగడం ప్రభుత్వానికి కనిపించడం లేదా? రికార్డు స్థాయిలో పంట ఉత్పత్తి సాధించామని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం... మరి ఉత్పత్తి పెరిగినప్పుడు ధరలు తగ్గాల్సింది పోయి.. బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయి?' అని ప్రశ్నించారు.'మీరు ఇస్తున్న సన్నబియ్యం పథకం సఫలం అయితే, ఎందుకు బియ్యం ధరలు అదుపు తప్పుతున్నాయి? మీరు ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదని చెప్పడానికి ఇది నిదర్శనం కాక మరేమిటి? ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు ఎమ్ఎస్పీ(మీ్రా) పేరిట దక్కుతున్నది నామమాత్రపు ధర. కానీ మధ్య దళారులకు దక్కుతున్నది క్వింటాకు రూ.8000 పై మాటే. రైతుకు గిట్టుబాటు ధర లేదు.. వినియోగదారుడికి అందుబాటు ధర లేదు.. లాభపడుతున్నది మాత్రం మధ్య దళారులు? కళ్లముందే ఈ తతంగం అంతా జరుగుతుంటే, ప్రభుత్వంలో ఎందుకు చలనం లేదు? బియ్యం మాత్రమే కాదు.. ఉల్లి రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లినూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 ధరలు అడ్డగోలుగా పెరిగితే సామాన్య కుటుంబం ఎలా బతకాలి? వంటింటి బడ్జెట్ తారుమారవుతున్నా.. పౌరసరఫరాల శాఖ ఏం చేస్తోంది? ధరల పర్యవేక్షణ గాలికి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? ప్రజల జేబులు ఖాళీ అవుతుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడం కాదు.. వెంటనే చర్యలు తీసుకోవాలి. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత, అధిక మార్జిన్లపై తక్షణం నిఘీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సన్నబియ్యం సహా నిత్యావసరాల ధరలకు వెంటనే అడ్డుకట్ట వేసి, సామాన్యుడిపై పడుతున్న భారం నుంచి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు.

# తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం



**హైదరాబాద్, అక్టోబరు 5 :**
తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. డిసెంబర్ 2027 నాటికి 67 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, ఫ్యూచర్ సిటీలో విద్యాసంస్థల ఏర్పాటుపై సీఎస్ సంజయ్ జాజు ఈరోజు (సోమవారం) సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. జూన్ 2028 నాటికి 87 స్కూళ్ల ఏర్పాటుకు ప్రణాళిక చేస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఒక్కో స్కూల్‌కు సుమారు 26 ఎకరాల్లో ఆధునిక మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫ్యూచర్ సిటీలో విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లకు ప్రత్యేక విధానం తీసుకువస్తామని చెప్పారు.ఇందుకోసం లండన్, బర్మింగ్‌హామ్ యూనివర్సిటీలతో పాటు మరో 4 విదేశీ వర్సిటీలు ఆసక్తి చూపిస్తున్నాయని సీఎస్ వివరించారు. విదేశీ వర్సిటీలకు మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులపై సమగ్ర విధానం ప్రవేశపెడతామని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ నాటికి స్పష్టమైన కార్యాచరణ, ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# భీమ్‌గల్ పీఎస్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం..
# పోలీసులే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ



**నిజామాబాద్, అక్టోబర్ 12:** జిల్లాలోని భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో సుధాకర్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. దీంతో అతడికి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్య చికిత్స కోసం అతడిని ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల వేధింపుల వల్లే సుధాకర్ ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు.భీమ్‌గల్ పట్టణంలో సుధాకర్ హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే రాత్రి 10.00 గంటల తర్వాత హోటల్‌లోని టేబుళ్లు బయట రహదారి పక్కన పెటాడు. గస్తీ విధులు నిర్వహిస్తున్న పోలీసులు.. రహదారిపై ఆ టేబుళ్లు తీయాలని సుధాకర్‌ను ఆదేశించారు. అతడు కాస్తా ముక్త సరిగా సమాధానం ఇచ్చాడు. దీంతో హోటల్ టేబుళ్లను అక్కడి నుంచి పోలీసులు తరలించారు. ఈ సందర్భంగా టేబుళ్లను వదిలి వెళ్లాలంటూ పోలీసులను సుధాకర్ బతిమిలాడాడు.కానీ వాటిని వారు వదిలి వెళ్లలేదు. ఈ నేపథ్యంలో సుధాకర్‌పై ఎస్ఐ తిరుపతి కేసు నమోదు చేశారు. ఇక సోమవారం కోర్టుకు వెళ్లాలంటూ సుధాకర్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. దీంతో అతడు తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దాంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ తన ఒంటిపై పోసుకుని నిప్పింటించుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. అతడి పరిస్థితి విషమంగా మారింది. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్య చికిత్స కోసం అతడిని ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఈ నెల 9న ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు -
# రసవత్తరంగా ముక్కోణపు పోరు




**హైదరాబాద్ :** తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్? ఆర్‌టీసీ)లో పది సంవత్సరాల తర్వాత గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన కార్మిక సంఘాలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ ముందడుగు వేస్తున్నాయి. ఈ మేరకు పథక రచన చేస్తున్నాయి. దీంతో ఎన్నికల సమీకరణాలు వేగంగా మారుతున్నా యి. ఈసారి యూనియన్ల మధ్య పోటీ కాకుండా కార్మిక సంఘాలు వేర్వేరు కూటములుగా ఏర్పడటంతో ముక్కోణపు పోరు నెలకొంది.(ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కర్స్? యూనియన్? (టీడబ్ల్యూయూ)కు అనూహ్యంగా మద్దతు ప్రకటించింది. దీంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకొంది. మరోవైపు ప్రధాన సంఘం ఎంప్లాయీస్ యూనియన్? (ఈయూ)కు మద్దతు ప్రకటించిన సీపీఐ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంది.(ప్రతి కార్మికుడికి రెండేసి ఓట్లుఈ సంవత్సరం నిర్వహించే ఎన్నికల్లో ప్రతి కార్మికుడికి రెండేసి ఓట్లుంటాయి. ఒకటి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి కాగా, మరొకటి రీజియన్ స్థాయి గుర్తింపు సంఘానికి ఓటేస్తారు. వామపక్ష పార్టీల కార్మిక సంఘాల అనుబంధ సంఘాలు ఎంప్లాయీస్? యూనియన్? (ఈయూ), స్టాఫ్? వర్కర్స్? యూనియన్? (ఎస్?డబ్ల్యూఎఫ్?) వేర్వేరు కూటముల్లో ఉన్నాయి. ఈయూతో తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) జట్టు కట్టాయి. ఈ కూటమి నుంచి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి ఈయూ పోటీపడుతోంది. మొత్తం 11 రీజియన్లుఆర్టీసీలో మొత్తం 11 రీజియన్లు ఉన్నాయి. వీటిలో వరంగల్?, ఖమ్మం రీజియన్?లలో ఎన్?ఎంయూ, మిగిలిన తొమ్మిది రీజియన్లలో గుర్తింపు సంఘం కోసం టీఎంయూ ఈ కూటమి నుంచి బరిలో నిలిచింది. సీఐటీయూ అనుబంధ ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)తో జట్టు కట్టింది. టీడబ్ల్యూయూ రాష్ట్ర స్థాయితో పాటు తొమ్మిది రీజియన్?లలో పోటీ చేస్తోంది. నల్గొండ, ఖమ్మం రీజియన్లలో ఎస్‌డబ్ల్యూఎఫ్‌కు మద్దతు ఇస్తోంది. టీజేఎంయూ, బహుజన వర్కర్స్ యూనియన్ మరో కూటమిగా ఏర్పడ్డాయి.

# నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్.. అక్టోబర్ 29న బీఆర్ఎస్వీ నిరసన



**హైదరాబాద్ :** తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి రేవంత్ రెడ్డి ప్రకటించిన 1000 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ నిరసన ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తుంగ బాలు మాట్లాడుతూ.. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో అక్టోబర్ 29న నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని, ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తామని చెప్పిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని గుర్తు చేశారు.ఉద్యోగ నియామకాల్లో తీవ్ర జాప్యం..గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, డీఎస్సీ, పోలీస్, వైద్యారోగ్య శాఖ తదితర నియామకాలను వేగవంతం చేస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని తుంగ బాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాల్లో తీవ్ర జాప్యం, పరీక్షల నిర్వహణలో స్పష్టత లేకపోవడం, తరచూ షెడ్యూళ్లలో మార్పులు, ఖాళీల భర్తీలో నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తుపై ఆందోళనతో ఉన్నారని పేర్కొన్నారు.ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వం నిరాశకు గురిచేస్తోందని తుంగ బాలు విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కొంపల్లి నరేష్, చాప భాస్కర్, కొమ్మనబోయిన సైదులు యాదవ్, అద్వైత్, వల్లమల్ల సూర్యప్రకాష్, కొండ గణేష్, ప్రసన్న కుమార్, సురేష్, రవికిరణ్, నిరంజన్, ప్రభాకర్, నితీష్ కుమార్, మహేష్, పరశురాం, సాయి కిరణ్, శాంతి కుమార్, రమేష్, శివ ప్రసాద్, కరుణాకర్, ముకేశ్, వినయ్, సాయి, నవీన్, మహేష్, సాయి చరణ్, శౌర్య మనోజ్, మహేందర్, మహిపాల్, కుమార్, శ్రీశైలం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన బాలికలకు ఫోన్ చేసి లైంగికంగా వేధించిన దుండగులు.. ఇద్దరి ఆత్మహత్యాయత్నం



**వరంగల్ జిల్లా :** వరంగల్ జిల్లా ఖానాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. ఇద్దరు గిరిజన బాలికలకు దుండగులు ఫోన్ చేసి లైంగిక వేధింపులకు గురి చేశారు. పోకిరీల వేధింపులు తాళలేక ఇద్దరు బాలికలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 35 మంది జూనియర్ లెక్చరర్లను తొలగించిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ




**రంగారెడ్డి :**ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. 35 మంది జూని యర్ లెక్చరర్లను (జూ) ఉద్యోగాలను నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసిం ది. వీరు నకిలీ పీజీ సర్టిఫికెట్లతో లెక్చ రర్ ఉద్యోగాలు పొందారని, వీరికి ఇచ్చి న షోకాజ్ నోటీసులకు సరైన సమా ధానంతో రాలేదు. అందుకే వీరిని విధుల నుంచి తొలగిస్తున్నామని ఇంట ర్మీడియట్ విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. 2014 కంటే ముందునుంచే కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న సుమారు 3000కు పైగా మందిని 2023లో రెగ్యులరైజ్ చేశారు.అయితే వీరిలో కొంతమంది ఇతర రాష్ట్రాల్లోని 16కు పైగా యూనివర్సిటీ ల్లో చదివినట్లు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సర్టిఫికెట్లు ఒరిజినలా లేదా నకిలీవా అని తెలుసుకునేందుకు ఇంటర్ విద్యాశాఖ అధికారులు ఆ యూనివర్సిటీలను పరిశీలించారు. ఆ సర్టిఫికెట్లు నకిలీవి అని తేలడంతో వారికి ముందుగా నోటీసులు జారీ చేశారు. వాటికి సరైన సమాధానం రాకపోవడంతో వారిని ఉద్యోగాల నుంచి తొలగించారు. వీరు రాష్ట్రంలోని రంగారెడ్డి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, నిజామాబాద్, నాగర్‌కర్నూలు, సిద్దిపేట, సంగారెడ్డి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, జగిత్యాలలోని జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్నారు.

# 40 శాతం లాభాల వాటా ప్రకటించడంలో జాప్యమెందుకు?



**రుద్రంపూర్, అక్టోబర్ 05 :**
కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు, డిపార్ట్‌మెంట్స్ వద్ద వినతిపత్రాలు సమర్పించారు. దానిలో భాగంగానే కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాలో వినతిపత్రాలు సమర్పించారు, ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించి, కార్మికులకు 40 శాతం లాభాల వాటాను ప్రకటించి చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తికి కార్మికులు అందిస్తున్న సేవలు కీలకమని ఏఐటీయూసీ పేర్కొంది. కార్మికుల శ్రమతో సంస్థకు లాభాలు వస్తున్నప్పుడు ఆ లాభాల్లో కార్మికులకు తగిన వాటా అందించడం యాజమాన్యం బాధ్యత అన్నారు. గతంలో కొనసాగుతున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గుర్తింపు పొందిన కార్మిక సంఘంతో చర్చించి లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.సింగరేణిలో ఉత్పత్తికి, కార్మికుల రక్షణకు అవసరమైన మెటీరియల్, పరికరాల కొరత ఏర్పడుతున్నట్లు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. మెటీరియల్ కొనుగోలుకు నిధుల కొరత ఉందని యాజమాన్యం పేర్కొంటున్న పరిస్థితి ఆందోళనకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు కార్మికుల ప్రాణ రక్షణకు అవసరమైన పరికరాలు, మెటీరియల్‌ను తక్షణమే అందుబాటులోకి తేవాలని కోరారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో కార్మికులకు చెల్లించాల్సిన పండుగ అడ్వాన్స్, లాభాల వాటా, దీపావళి బోనస్, పి.ఎల్.ఆర్.ఎస్. వంటి ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో అందించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. చెల్లింపుల్లో జాప్యం జరిగితే కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు.సింగరేణికి తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల నుంచి సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నట్లు ఏఐటీయూసీ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఆ బకాయిలను వెంటనే సింగరేణికి ఇప్పించాలని కోరింది. బకాయిలు అందితే సంస్థ ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడంతో పాటు ఉత్పత్తి, రక్షణకు అవసరమైన మెటీరియల్ కొనుగోలు చేయడానికి, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి,, నితిన్, పిట్ కార్యదర్శిలు భుక్య రమేష్, మధు కృష్ణ, కమల్, సురేందర్, మెంగన్ రవి, కోటి, నరేష్, సుధీర్, అనంతలక్ష్మి, రమేష్, మల్లికార్జున్, శ్యాం కిరణ్, నాయకులు రామచందర్ సందీప్, సాయిపవన్, మురళి, ఓదెలు, శ్రీనివాస్, అవినాష్, రాజాలపూడి సాంబమూర్తి, రమేష్, కరుణాకర్, గుమ్మడి మురళి, సురేందర్ రెడ్డి, కుమార్ రావు, సందీప్ పాల్గొన్నారు.

ప్రజా అక్షర న్యూస్ TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...

# ఫిట్‌నెస్ లేక పక్కకు తప్పుకున్న పాండ్యా..




భారత క్రికెట్ జట్టులో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఒకవైపు ప్రధాన భారత జట్టు వెస్టిండీస్‌తో టీ-20 సిరీస్‌లో తలపడేందుకు సిద్ధమవుతుండగా, మరోవైపు ఇండియా-ఏ క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా-ఏ జట్టుతో మూడు వన్డేల సిరీస్ ఆడేందుకు సమాయత్తమవుతోంది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్ అక్టోబర్ 6వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు బీసీసీఐ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ నేతృత్వంలో బరిలోకి దిగుతున్న ఈ జట్టులో దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్న ప్రతిభావంతులైన ఆటగాళ్లకు పెద్దపీట వేశారు.హార్దిక్ పాండ్యాకు నిరాశఈ వన్డే సిరీస్ కోసం ప్రకటించిన ఇండియా-ఏ జట్టులో స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా ఉండాల్సి ఉంది. అయితే గత కొంతకాలంగా గాయాలతో ఇబ్బందిపడుతున్న హార్దిక్ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో ఈ సిరీస్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నివేదిక ప్రకారం హార్దిక్ కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌కు కూడా ఆయన అందుబాటులో ఉండటం అనుమానంగా మారింది. హార్దిక్ స్థానంలో యువ ఆటగాడు సూర్యాంశ్ షెడ్గేను సెలక్టర్లు జట్టులోకి ఎంపిక చేశారు.పూర్తి షెడ్యూల్, వేదిక వివరాలుఆస్ట్రేలియా-ఏ జట్టు గత నెల సెప్టెంబర్ నుంచి భారత్‌లో పర్యటిస్తోంది. ఇప్పటికే ఇరు జట్ల మధ్య రెండు అనధికారిక టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ముగిసింది. ఇందులో తొలి మ్యాచ్‌లో ఇండియా-ఏ జట్టు ఘన విజయం సాధించగా, రెండో మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీని తర్వాత ఇప్పుడు అక్టోబర్ ఆరు నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. తొలి వన్డే అక్టోబర్ 6న జరగనుండగా, రెండో వన్డే అక్టోబర్ 9, మూడో వన్డే అక్టోబర్ 11న జరగనున్నాయి. ఈ మూడు మ్యాచ్‌లకు పుదుచ్చేరిలోని సీఏపీఎస్ మైదానం వేదికగా నిలవనుంది.ఇండియా-ఏ వన్డే జట్టు వివరాలుఈ సిరీస్ కోసం బీసీసీఐ పటిష్టమైన జట్టును ప్రకటించింది. జట్టులో రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య, నమన్ ధీర్, నిషాంత్ సింధూ, అర్షిన్ కులకర్ణి, అర్షద్ ఖాన్, విప్రజ్ నిగమ్, కుమార్ కుషాగ్, యశ్ ఠాకూర్, గుర్జాపనీత్ సింగ్, సూర్యాంశ్ షెడ్గే ఉన్నారు.

# ప్రైవేట్ బ్యాంకులు 5 రోజుల పనిదినాలు స్వచ్ఛందంగా అమలు చేయవచ్చా..?




బ్యాంకు ఉద్యోగుల ఐదు రోజుల పని దినాల డిమాండ్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇటీవల సమ్మెను వాయిదా వేసుకున్నప్పటికీ.. వారి ప్రధాన డిమాండ్‌లలో ఐదు రోజుల పనిదినాల అమలు కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకుల్లో ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఒక సర్వే ప్రకారం, 82.2 శాతం మంది బ్యాంకు ఉద్యోగులు అధిక పనిభారంతో సతమతమవుతున్నారు. ఉదయం బ్యాంకులు తెరిచినప్పటి నుంచి కస్టమర్లను డీల్ చేయడంతో పాటు, బ్యాక్ ఎండ్ వర్క్, టార్గెట్లు, కరెన్సీ లెక్కలు చూసుకోవడంలో రోజంతా గడిచిపోతుంది. చాలామంది రాత్రి తొమ్మిది, పది గంటల వరకు కూడా పని చేయాల్సి వస్తుంది. గత పదేళ్లలో డిజిటల్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు గణనీయంగా పెరగడం, ఏటీఎంలు అందుబాటులోకి రావడంతో ఖాతాదారులు శాఖలకు రావడం తగ్గింది. అయినప్పటికీ బ్యాంకు ఉద్యోగుల పనిభారం తగ్గడం లేదు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ వంటి సంస్థలు ఇప్పటికే ఐదు రోజుల పని విధానాన్ని పాటిస్తున్నాయి. ఇదే విధానాన్ని బ్యాంకింగ్ రంగంలోనూ అమలు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. బ్యాంకుల దైనందిన నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు ఉద్యోగుల మానసిక ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ డిమాండ్‌పై కేంద్రం సానుకూలంగా ఉన్నప్పటికీ.. అమలు చేయడంలో జాప్యం చేస్తోంది.ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అమలు చేయడం గురించి సంగతి అలా ఉంచితే.. ప్రైవేట్ రంగ బ్యాంకులుతమ విచక్షణ మేరకు 5 రోజుల పని వారాన్ని అమలు చేయవచ్చా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఒకవేళ అన్ని శనివారాలు బ్యాంకులను మూసి వేయాలనుకుంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) నుండి అనుమతి అవసరమా? అనే సందేహం చాలామందిలో ఉంది. అయితే ఆర్బీఐ నిబంధనల ప్రకారం.. ఖచ్చితంగా ప్రైవేట్ బ్యాంక్ అనుమతి తీసుకోవాలి. ఆర్బీఐ అనుమతి ఇస్తేనే ప్రైవేట్ బ్యాంక్ అయినా సెలవు ప్రకటించడం కుదరుతుంది. ప్రైవేట్ బ్యాంకు స్వచ్ఛందంగా 5 రోజుల పనివారాన్ని ప్రవేశపెట్టి ఆర్‌బిఐ, ప్రభుత్వ నిబంధనల ప్రకారంస్పష్టమైన అనుమతి అవసరం. అనుమతి తీసుకోకుండా అమలు చేయడం కుదరదు.గత పదేళ్లలో బ్యాంకింగ్ రంగంలో డిజిటల్ మార్పులు భారీగా వచ్చాయి. మనదేశంలో 2025 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో డిజిటల్ చెల్లింపుల వాటా ఏకంగా 99.8 శాతానికి చేరింది. 2026 ఆగస్టు నెలలో యూపీఐ లావాదేవీలు 24.51 బిలియన్ల రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఏటీఎంలు, క్యాష్ రీసైక్లర్ మిషన్లు అందుబాటులోకి రావడంతో నగదు జమ చేయడం, తీసుకోవడం సులువైంది. ఈ యంత్రాలు దొంగనోట్లను గుర్తించడంతో పాటు నగదు పంపిణీని కూడా సురక్షితంగా చేస్తాయి. ఖాతాదారులు చిన్నచిన్న పనుల

# వైభవ్ సూర్యవంశీకి షాక్..




భారత్-వెస్టిండీస్ మధ్య ఐదు టీ20ల సిరీస్ అక్టోబర్ 6 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ లక్నోలోని భారత్ రత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు మొదలవుతుంది. ఈ నేపథ్యంలో మాజీ భారత బ్యాటర్ ఛతేశ్వర్ పుజారా తనకు నచ్చిన టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌ను ప్రకటించాడు. పుజారా ఎంపికలో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కలేదు. ఏషియన్ గేమ్స్‌లో భారత జట్టుకు వైభవ్ సూర్యవంశీ ఓపెనర్‌గా ఆడాడు. శ్రీలంకతో సెమీఫైనల్‌లో 21 బంతుల్లో 38 పరుగులతో ఆకట్టుకున్నాడు. పాకిస్థాన్‌తో గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో 9 బంతుల్లో 15 పరుగులు చేశాడు. ఏషియన్ గేమ్స్‌లో భారత్ వరుసగా రెండో పురుషుల క్రికెట్ గోల్డ్ మెడల్ సాధించింది. అయినా తొలి టీ20కి పుజారా మరో కాంబినేషన్‌ను ఎంచుకున్నాడు. వైభవ్ స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డిని తీసుకున్నాడు. నితీశ్ బ్యాటింగ్‌తో పాటు పేస్ బౌలింగ్ చేయగలగడం పుజారా ఎంపికలో కీలకంగా కనిపిస్తోంది.సంజూ-అభిషేక్ ఓపెనర్లుపుజారా అంచనా ప్రకారం అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఇన్నింగ్స్ ప్రారంభిస్తారు. మూడో స్థానంలో ఇషాన్ కిషన్‌కు అవకాశం ఇచ్చాడు. నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో తిలక్ వర్మ ఉంటారు. ఆరో స్థానంలో శివమ్ దూబే, ఏడో స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి ఉంటారు. ఏషియన్ గేమ్స్ ఫైనల్‌లో తిలక్ వర్మ కీలక బ్యాటింగ్ ప్రదర్శన ఇచ్చిన నేపథ్యంలో అతడికి మిడిలార్డర్‌లో మంచి బాధ్యత దక్కే అవకాశం ఉంది.బౌలింగ్‌లో అక్షర్, కుల్దీప్‌పుజారా టీమ్‌లో అక్షర్ పటేల్ ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. అతడి తర్వాత కుల్దీప్ యాదవ్ స్పిన్నర్‌గా వస్తాడు. ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్ పేస్ బాధ్యతలు తీసుకుంటారని పుజారా భావించాడు. అధికారిక ౨౦× స్క్వాడ్‌లో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉండగా అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సంజూ శాంసన్, తిలక్ వర్మ,

# రూ.20 వేలలోపే పెట్టుబడి.. ఇంటి నుంచే 5 బిజినెస్‌లు..




బిజినెస్ ప్రారంభించాలంటే లక్షల రూపాయలు అవసరమని చాలామంది భావిస్తారు. కానీ తక్కువ పెట్టుబడితో కూడా కొన్ని చిన్న వ్యాపారాలను ఇంటి నుంచే ప్రారంభించవచ్చు. ముఖ్యంగా డిజిటల్ మార్కెటింగ్, ఫుడ్, గిఫ్టింగ్, రీసెల్లింగ్ వంటి రంగాల్లో తక్కువ పెట్టుబడితో అవకాశాలు ఉన్నాయి. రూ.10 వేల నుంచి రూ.20 వేల బడ్జెట్‌తో ప్రారంభించగల ఐదు బిజినెస్ ఐడియాలు ఇవి.1. కస్టమైజ్డ్ గిఫ్టింగ్, ప్రింటింగ్ బిజినెస్ బర్త్‌డేలు, వివాహాలు, యానివర్సరీలు, పండుగలు, కార్పొరేట్ ఈవెంట్స్ సందర్భంగా కస్టమైజ్డ్ గిఫ్ట్‌కు డిమాండ్ ఉంటుంది. మగ్స్, టీ-షర్ట్స్, కుషన్స్, కీచైన్ల వంటి వస్తువులపై పేర్లు, ఫొటోలు లేదా ప్రత్యేక సందేశాలను ప్రింట్ చేసి విక్రయించవచ్చు. ఈ బిజినెస్‌ను ప్రారంభించడానికి సుమారు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు పెట్టుబడి అవసరం కావచ్చు. ఉదాహరణకు రూ.80-100 వరకు తయారీ ఖర్చయ్యే కస్టమైజ్డ్ మగ్‌ను మార్కెట్‌లో రూ.250-350 వరకు విక్రయించే అవకాశం ఉంటుంది. అయితే వాస్తవ లాభం ముడిసరుకు, మార్కెటింగ్, ఆర్డర్ల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది.ఉద్యోగులు, విద్యార్థులు, బిజీగా ఉండే కుటుంబాల్లో ఇంటి వంటలకు డిమాండ్ ఉంటుంది. అందుకే ఇంటి నుంచే రెడీ-టు-కుక్ లేదా ఫ్రోజెన్ ఫుడ్ తయారు చేసి విక్రయించే అవకాశం ఉంది. పరాటా బేస్, థేప్లా, అల్లం-వెల్లుల్లి పేస్ట్, సమోసాలు, కబాబ్‌లు, ఇంట్లో తయారు చేసిన మసాలాలు వంటి ఉత్పత్తులను తయారు చేయవచ్చు. ప్రారంభ పెట్టుబడి సుమారు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు ఉండవచ్చని కథనం పేర్కొంటోంది. ప్యాకేజింగ్, సీలింగ్ మెషిన్, ముడి పదార్థాలు వంటి వాటికి ఖర్చు అవుతుంది. ముందుగా 20-30 మంది రెగ్యులర్ కస్టమర్లను సంపాదించుకోవడం ద్వారా వ్యాపారాన్ని క్రమంగా పెంచుకోవచ్చు. గమనిక: ఆహార వ్యాపారం ప్రారంభించేటప్పుడు స్థానిక నిబంధనలు, అవసరమైన లైసెన్సులు, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి.

# వెస్టిండీస్ సిరీస్ గెలిచినా ఆనందం లేదు.




: భారత్-వెస్టిండీస్ వన్డే సిరీస్‌ను టీమిండియా 2-1తో గెలుచుకుంది. కానీ చివరి మ్యాచ్‌లో వచ్చిన ఓటమి భారత జట్టు లోపాలను బయటపెట్టింది. ముఖ్యంగా బౌలింగ్‌లో చివరి ఓవర్ల ప్రణాళిక, ఫీల్డింగ్ విషయంలో మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్వయంగా చెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌కు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. ఈ లోపాలను సరిచేసుకోవడం చాలా ముఖ్యమని గిల్ అభిప్రాయపడ్డాడు. వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల్లో భారత బ్యాటింగ్ విభాగం మంచి ప్రదర్శన ఇచ్చింది. కానీ బౌలింగ్, ఫీల్డింగ్‌లో మాత్రం కొన్ని సమస్యలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా చివరి రెండు మ్యాచ్‌ల్లో వెస్టిండీస్ భారీ స్కోర్లు చేసింది. గువాహాటిలో 405 పరుగులు చేసిన కరీబియన్ జట్టు.. మూడో వన్డేలో 352 పరుగుల లక్ష్యాన్ని కూడా ఛేదించింది. దీంతో భారత బౌలింగ్‌పై ప్రశ్నలు మొదలయ్యాయి. మూడో వన్డే తర్వాత గిల్ మాట్లాడుతూ.. చివరి ఓవర్లలో దాడి చేయాలా, ప్రొటెక్టివ్ గా బౌలింగ్ చేయాలా అన్న విషయంలో కొన్ని సందర్భాల్లో స్పష్టత లేకపోయిందని చెప్పాడు. ప్రత్యర్థి జట్టు ఐదు లేదా ఆరు వికెట్లు కోల్పోయినప్పుడు ఫీల్డ్ ఎలా సెట్ చేయాలన్న విషయంలో కూడా మరింత స్పష్టమైన ప్రణాళిక అవసరమని పేర్కొన్నాడు. ప్రపంచకప్ లాంటి పెద్ద టోర్నీలో ఇలాంటి చిన్న తప్పులు కూడా మ్యాచ్ ఫలితాన్ని మార్చే అవకాశం ఉంది.భారత జట్టు ఫీల్డింగ్ కూడా ఆశించిన స్థాయిలో లేదని గిల్ స్పష్టం చేశాడు. సిరీస్‌లో పలుమార్లు క్యాచ్‌లు జారవిడిచిన భారత ఆటగాళ్లు ప్రత్యర్థికి అదనపు అవకాశాలు ఇచ్చారు. గిల్ చెప్పిన లెక్కల ప్రకారం సిరీస్ మొత్తంలో సుమారు ఆరు నుంచి ఏడు క్యాచ్‌లు చేజారాయి. ప్రపంచకప్‌కు వెళ్లే ముందు ఫీల్డింగ్‌ను అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని భారత కెప్టెన్ పేర్కొన్నాడు.న్యూచండీగఢ్‌లో జరిగిన మూడో వన్డేలో భారత్ మొదట బ్యాటింగ్ చేసి 50 ఓవర్లలో 7 వికెట్లకు 351 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ అజేయంగా 129 పరుగులు చేయగా.. రోహిత్ శర్మ 92 పరుగులతో రాణించాడు. 352 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు కెప్టెన్ షాయ్ హోప్ అద్భుతమైన అజేయ 162 పరుగులతో విజయాన్ని అందించాడు. 48.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. వన్డేల్లో వెస్టిండీస్‌కు ఇదే అత్యధిక విజయవంతమైన ఛేజ్‌గా నిలిచింది..వెస్టిండీస్ సిరీస్‌లో భారత్ పలువురు యంగ్ ప్లేయర్లకు అవకాశాలు ఇచ్చింది. జస్ప్రీత్ బుమ్రా ఏషియన్ గేమ్స్‌లో

# ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేవారికి బిగ్ అలర్ట్.. వచ్చేఏడాది నుంచి కొత్త రూల్స్..!




ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారి సంఖ్య పెరిగిపోతుంటుంది. ఇప్పుడు పండల సీజన్ల నేపథ్యంలో ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్‌లలో భారీ ఆఫర్లు ఉంటాయి. అయితే ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తుంటారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు అందులో మీ పేరు, ఫోన్ నంబర్, డెలివరీ చిరునామా, లాగిన్ వివరాలు, చెల్లింపు సమాచారం ఉండవచ్చు.జనవరి 2027 నుండి అమల్లోకి రానున్న భారతదేశపు కొత్త వినియోగదారుల రక్షణ (ఇ-కామర్స్) (సవరణ) నిబంధనలు, 2026, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లను మరింత పారదర్శకంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ నిబంధనలు ధరల నిర్ణయం, విక్రేత వెల్లడింపులు, సెర్చ్ ర్యాంకింగ్‌లు, ప్రకటనలు, డార్క్ ప్యాటర్న్‌లు, వినియోగదారుల డేటా, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలలో అవసరాలను కఠినతరం చేస్తాయి.పండుగ సీజన్ అయినా లేదా ఏదైనా సాధారణ రోజు అయినా, ఆన్‌లైన్ షాపింగ్ సైట్లలో కనిపించే "బంపర్ సేల్స్" "భారీ డిస్కౌంట్లు" వంటి ట్యాగ్‌లు తరచుగా మనల్ని ఆకర్షిస్తాయి. కానీ చాలాసార్లు, ఈ ఆఫర్లు కేవలం కంటికి కనిపించే మాయగానే మిగిలిపోతాయి. ఇప్పుడు, ఇ-కామర్స్ కంపెనీల ఈ మోసాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. వినియోగదారుల వ్యవహారాల శాఖ "వినియోగదారుల రక్షణ (ఇ-కామర్స్) (సవరణ) నిబంధనలు, 2026ను జారీ చేసింది. ఇవి జనవరి 1, 2027 నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తాయి. డిజిటల్ మోసాల నుండి వినియోగదారులను రక్షించడం ద్వారా స్వచ్ఛమైన మరియు పారదర్శకమైన ఇ-కామర్స్ వ్యవస్థను సృష్టించడమే ఈ కొత్త నిబంధనల యొక్క ప్రధాన ఉద్దేశ్యం.2025 సంవత్సరపు గణాంకాలను పరిశీలిస్తే, జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (జీజఎ)లో మొత్తం 17.71 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో 29 శాతం (సుమారు 5.11 లక్షలు) కేవలం ఈ-కామర్స్ రంగం నుంచే వచ్చాయి. పెరుగుతున్న వినియోగదారుల ఆందోళనలకు ప్రతిస్పందనగా, అన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు జీజఎ వ్యవస్థతో అనుసంధానం కావడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇది వినియోగదారుల సమస్యల వేగవంతమైన పరిష్కారానికి దోహదపడుతుంది.

ప్రజా అక్షర న్యూస్
TEL TEL - 20684
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...



# నాన్న కోసమే ఆ సినిమా చేశా.. ఇండస్ట్రీ వదిలేద్దామనుకున్నా

విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టినప్పటికీ.. తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి శ్రుతి హాసన్. నటనతో పాటు గాయనిగా, సంగీతంపై ఆసక్తి ఉన్న ఆర్టిస్ట్‌గా కూడా తన ప్రతిభను చాటుకుంది. అయితే సినీ ప్రయాణం ప్రారంభమైన సమయంలో మాత్రం ఆమె కెరీర్‌పై ఎన్నో సందేహాలు ఉండేవట. ముఖ్యంగా తాను నటించిన ఓ సినిమా విషయంలో శ్రుతి హాసన్‌కు తనపైనే నమ్మకం తగ్గిపోయిందట. శ్రుతి హాసన్‌కు సినిమాలతో పరిచయం చిన్న వయసులోనే ఏర్పడింది.తన తండ్రి కమల్ హాసన్ నటించిన చిత్రాల్లో బాలనటిగా కనిపించిన ఆమె.. సినిమాలపై పెద్దగా ఆసక్తి లేకపోయినా, కుటుంబ నేపథ్యం కారణంగా సినీ ప్రపంచాన్ని దగ్గరగా చూసింది. కమల్ హాసన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'హే రామ్' సినిమాలో కూడా శ్రుతి హాసన్ కనిపించింది. ఈ చిత్రంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కుమార్తె పాత్రలో ఆమె నటించింది. అయితే ఆ పాత్రను చేసే విషయంలో తన తండ్రి కమల్ హాసన్‌దే కీలక పాత్ర అని శ్రుతి గతంలో వెల్లడించింది. ఆ పాత్రలో నటించమని కమల్ హాసన్ తనను ప్రత్యేకంగా కోరారని ఆమె చెప్పింది. తన తండ్రి కమల్ హాసన్ నటించిన చిత్రాల్లో బాలనటిగా కనిపించిన ఆమె.. సినిమాలపై పెద్దగా ఆసక్తి లేకపోయినా, కుటుంబ నేపథ్యం కారణంగా సినీ ప్రపంచాన్ని దగ్గరగా చూసింది. కమల్ హాసన్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'హే రామ్' సినిమాలో కూడా శ్రుతి హాసన్ కనిపించింది. ఈ చిత్రంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కుమార్తె పాత్రలో ఆమె నటించింది. అయితే ఆ పాత్రను చేసే విషయంలో తన తండ్రి కమల్ హాసన్‌దే కీలక పాత్ర అని శ్రుతి గతంలో వెల్లడించింది. ఆ పాత్రలో నటించమని కమల్ హాసన్ తనను ప్రత్యేకంగా కోరారని ఆమె చెప్పింది. అయితే పెద్దయ్యాక హీరోయిన్‌గా తన సినీ కెరీర్‌ను ప్రారంభించిన శ్రుతి హాసన్‌కు తొలి రోజుల్లో ఆశించిన స్థాయిలో విజయాలు దక్కలేదు. 2009లో వచ్చిన హిందీ చిత్రం 'లక్'తో ఆమె హీరోయిన్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా శ్రుతి హాసన్ కెరీర్‌కు ఆశించిన స్థాయిలో బలమైన ఆరంభాన్ని ఇవ్వలేకపోయింది. అంతేకాదు.. సినిమాలో తన నటనను చూసుకున్న తర్వాత శ్రుతి హాసన్ కూడా సంతృప్తి చెందలేదట. తాను నటించిన విధానం తనకే నచ్చలేదని భావించిన శ్రుతి.. ఇక సినిమాల్లో కొనసాగకపోవడమే మంచిదని ఒక దశలో అనుకుందట. ఇండస్ట్రీ నుంచి తప్పుకోవాలని కూడా ఆలోచించినట్లు ఆమె గతంలో వెల్లడించింది.

# అందంలో అప్సరస ఆమె





సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత సెలబ్రిటీలకు, అభిమానులకు మధ్య దూరం చాలా వరకు తగ్గిపోయింది. ఒకప్పుడు హీరోహీరోయిన్లకు సంబంధించిన ఏ చిన్న సమాచారం తెలుసుకోవాలన్నా మ్యాగజైన్లు, టీవీ కార్యక్రమాలు లేదా వార్తలపై ఆధారపడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సెలబ్రిటీలు తమకు సంబంధించిన విషయాలను స్వయంగా సోషల్ మీడియా వేదికల ద్వారా అభిమానులతో పంచుకుంటున్నారు.ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వచ్చిన తర్వాత ఈ ట్రెండ్ మరింత పెరిగింది. సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు తమ వ్యక్తిగత జీవితంలోని ఆసక్తికరమైన విషయాలు, ట్రావెల్ ఫొటోలు, చిన్ననాటి జ్ఞాపకాలు, ఫ్యామిలీ ఫొటోలు, స్పెషల్ మూమెంట్స్‌ను సెలబ్రిటీలు అభిమానులతో షేర్ చేస్తున్నారు. దీంతో వారు పోస్ట్ చేసే ప్రతి ఫొటో, వీడియో కొద్ది నిమిషాల్లోనే వైరల్‌గా మారుతోంది. అలాంటి ఓ పాత ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ వచ్చిన తర్వాత ఈ ట్రెండ్ మరింత పెరిగింది. సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు తమ వ్యక్తిగత జీవితంలోని ఆసక్తికరమైన విషయాలు, ట్రావెల్ ఫొటోలు, చిన్ననాటి జ్ఞాపకాలు, ఫ్యామిలీ ఫొటోలు, స్పెషల్ మూమెంట్స్‌ను సెలబ్రిటీలు అభిమానులతో షేర్ చేస్తున్నారు. దీంతో వారు పోస్ట్ చేసే ప్రతి ఫొటో, వీడియో కొద్ది నిమిషాల్లోనే వైరల్‌గా మారుతోంది. అలాంటి ఓ పాత ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. ఫొటోలో ప్రముఖ నటి రోజాతో కలిసి ఓ చిన్నారి కనిపిస్తోంది. చిన్నప్పుడు ఎంతో అమాయకంగా కనిపిస్తున్న ఆ అమ్మాయి.. ఇప్పుడు మాత్రం టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాదు, సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఇంతకీ రోజాతో ఉన్న ఆ చిన్నారి ఎవరు.? ఫొటోను చూసిన వెంటనే చాలామందికి ఆమె ఎవరో గుర్తుపట్టడం కాస్త కష్టంగానే ఉంటుంది. అయితే ఒకసారి ఆమె పేరు తెలిస్తే.. 'అరే.. ఈ అమ్మాయేనా?' అని ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే ఇప్పుడు ఆమె తెలుగు ప్రేక్షకులకు బాగా పరిచయమైన సెలబ్రిటీ.



# బిగ్ బాస్ తెలుగు 10 నుంచి సృష్టి వ్యాకరణం ఎలిమినేషన్..

బిగ్ బాస్ తెలుగు 10వ సీజన్‌లో మరో కీలక ఎలిమినేషన్ చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి, ఆ తర్వాత అగ్నిపరీక్ష ద్వారా గుర్తింపు తెచ్చుకున్న సృష్టి వ్యాకరణం.. బిగ్ బాస్ హౌస్‌లో తన ప్రయాణాన్ని ముగించినట్లు సమాచారం. నాలుగో వారంలో జరిగిన ఎలిమినేషన్‌లో ఆమెకు తక్కువ ఓట్లు రావడంతో బయటకు వెళ్లాల్సి వచ్చిందనే ప్రచారం జరుగుతోంది. బిగ్ బాస్‌లోకి అడుగుపెట్టిన తర్వాత సృష్టి వ్యాకరణం తనదైన శైలిలో గేమ్ ఆడేందుకు ప్రయత్నించింది. అయితే హౌస్‌లో ఆమెకు ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల నుంచి మద్దతు లభించలేదనే టాక్ వినిపించింది. ముఖ్యంగా నామినేషన్ సమయంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు ఆమె ఓట్లు తక్కువ పడేలా చేశాయని సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. బిగ్ బాస్ తెలుగు 10 నాలుగో వారం ఎలిమినేషన్ ప్రక్రియలో సృష్టి వ్యాకరణం, దేబ్జానీ, అమన్ తదితరులు డేంజర్ జోన్‌లో ఉన్నారు. మొదట్లో ఓటింగ్ లెక్కల్లో సృష్టి కొంత వెనుకబడినట్లు వార్తలు వచ్చాయి. చివరి వరకు ఓటింగ్ ట్రెండ్స్‌లో మార్పులు కనిపించినప్పటికీ.. చివరకు సృష్టి ఎలిమినేట్ అయినట్లు సమాచారం.చిరంజీవి, వెంకటేష్‌లతో కనిపించిన ఈ అమ్మాయి ఎవరో తెలుసా.? సోషల్ మీడియాను ఊపేస్తుందిగా..ప్రేక్షకుల ఓట్లే ఆమె ఎలిమినేషన్‌కు ప్రధాన కారణంగా నిలిచాయని ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. హౌస్‌లో సృష్టి వ్యాకరణం ప్రయాణంలో సుధీర్‌తో జరిగిన వివాదం ఎక్కువగా చర్చకు వచ్చింది. నామినేషన్ సమయంలో ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో సృష్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. సుధీర్‌పై సృష్టి చేసిన కొన్ని ఘాటు వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కోపంలో ఆమె చేసిన వ్యాఖ్యలు, ఆమె ప్రవర్తనపై హౌస్‌లోనూ బయటా చర్చ జరిగింది. ఈ ఘటన తర్వాత సృష్టి గేమ్‌పై ప్రేక్షకుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయని బిగ్ బాస్ వర్గాల్లో టాక్

# ఆయనతో ఉన్న అనుబంధం ఎప్పటికీ మర్చిపోలేను..



టాలీవుడ్‌లో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు పూరి జగన్నాథ్‌కు ఇండస్ట్రీలో ఎంతోమంది అభిమానులు, సన్నిహితులు ఉన్నారు. ముఖ్యంగా ఆయనతో కలిసి పనిచేసిన నటీనటులు, టెక్నీషియన్లు పూరి వర్కింగ్ స్టైల్ గురించి తరచూ ఆసక్తికర విషయాలను వెల్లడిస్తుంటారు. తాజాగా నటుడు కృష్ణుడు కూడా పూరి జగన్నాథ్‌తో తనకున్న అనుబంధాన్ని, ఆయనతో కలిసి పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన పోకిరి సినిమా టాలీవుడ్‌లో ఎలాంటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సినిమాతో పూరి జగన్నాథ్‌కు ఉన్న ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్ మరింత బలంగా ప్రేక్షకులకు పరిచయమైంది. అయితే తనకు పూరితో ఉన్న అనుబంధం నటుడిగా ప్రారంభం కాలేదని కృష్ణుడు వెల్లడించారు. పోకిరి సినిమా సమయంలో ఆయన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశం తనకు లభించిందని తెలిపారు. ఆ సమయంలో పూరి జగన్నాథ్ పని చేసే విధానాన్ని దగ్గరగా గమనించే అవకాశం రావడం తనకు ఎంతో ఉపయోగపడిందని చెప్పారు.పోకిరి తర్వాత పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన బుజ్జిగాడు సినిమాలో నటుడిగా మంచి పాత్రను దక్కించుకున్నానని కృష్ణుడు గుర్తు చేసుకున్నారు. ఒక దర్శకుడి దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన తర్వాత అదే దర్శకుడి సినిమాలో నటుడిగా అవకాశం రావడం తన ప్రయాణంలో ప్రత్యేకమైన అనుభవమని పేర్కొన్నారు. పూరి జగన్నాథ్‌తో పనిచేసిన ఈ రెండు దశలు తన కెరీర్‌లో చాలా ముఖ్యమైనవిగా నిలిచిపోయాయని కృష్ణుడు తెలిపారు. పూరి జగన్నాథ్ వ్యక్తిత్వం గురించి మాట్లాడిన కృష్ణుడు.. ఆయనలో ఉండే ఎనర్జీ, ఉత్సాహం తనను ఎప్పుడూ ఆకట్టుకునేవని చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా పూరి చాలా చురుగ్గా ఉంటారని, పని ఒత్తిడి ఉన్నప్పటికీ దాని ప్రభావం తనపై కనిపించనివ్వకుండా ఉండేవారని పేర్కొన్నారు.సెట్‌లో ఆయన వ్యవహరించే తీరు చాలా కూల్‌గా ఉన్నప్పటికీ.. సినిమా విషయంలో మాత్రం చాలా స్పష్టమైన ఆలోచనతో ముందుకు వెళ్తారని కృష్ణుడు వివరించారు. పూరి జగన్నాథ్‌కు సినిమా విషయంలో పూర్తి క్లారిటీ ఉంటుందని కృష్ణుడు అన్నారు. ఒక సన్నివేశం ఎలా

# మూడేళ్లు ఆ డైరెక్టర్ ఇంటి చుట్టూ తిరిగా.. నెలకు రూ.50 వేల జాబ్ కూడా వదిలేసా..



సినిమా రంగంలో సక్సెస్ సాధించిన ప్రతి దర్శకుడి వెనుకా ఒక ఆసక్తికరమైన ప్రయాణం ఉంటుంది. తెరపై కనిపించే పేరు, క్రేజ్ రావడానికి ముందు ఎన్నో అవమానాలు, ఎదురుచూపులు, రిజెక్షన్స్ ఎదుర్కొన్నవాళ్లు చాలామందే ఉన్నారు. అలాంటి కష్టాల నుంచి దర్శకుడిగా ఎదిగిన వారిలో శ్రీకాంత్ ఓదెల ఒకరు. దసరా, ది ప్యారడైజ్ వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోజులను తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. శ్రీకాంత్ ఓదెలకు చిన్నప్పటి నుంచే సినిమా అంటే ఆసక్తి. అయితే దర్శకుడిగా మారాలనే లక్ష్యంతో ఆయన వేసిన తొలి అడుగులు అంత సులభంగా సాగలేదు. ముఖ్యంగా తనకు ఎంతో ఇష్టమైన దర్శకుడు సుకుమార్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయాలనే కోరికను నెరవేర్చుకోవడానికి చాలా కాలం ప్రయత్నించారట.ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో శేషు అనే లెక్చరర్ ద్వారా సుకుమార్‌తో పరిచయం ఏర్పడే అవకాశం లభించిందని శ్రీకాంత్ తెలిపారు. ఆ పరిచయాన్ని ఉపయోగించుకుని సుకుమార్ టీమ్‌లో చేరేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పట్లో అవకాశం దక్కలేదట. 'ఆర్య 2' తర్వాత అన్నపూర్ణ స్టూడియోలో సుకుమార్‌ను కలిసినట్లు శ్రీకాంత్ వెల్లడించారు. అప్పటి నుంచి ఆయన దగ్గర పనిచేయాలనే పట్టుదల మరింత పెరిగిందట. అవకాశం కోసం ఏకంగా మూడేళ్ల పాటు సుకుమార్ ఇంటి చుట్టూ తిరిగినట్లు చెప్పారు.రోజూ ఉదయం అపార్ట్‌మెంట్ దగ్గరకు వెళ్లి సుకుమార్‌ను కలిసేందుకు ప్రయత్నించేవాడినని, ఉదయం గుడ్ మార్నింగ్,

# బిగ్ బాస్ ఇంట్లో టెన్షన్.. ఆమె బ్యాక్ బిచ్చింగ్ స్టార్.. అతను కన్నింగ్



బిగ్ బాస్ ఇంట్లో మూడో వారం కెప్టెన్సీ కంటెండర్ టాస్కులు ఆసక్తికరంగా సాగుతున్నాయి. కంటెస్టెంట్ల మధ్య పోటీ, గొడవలు, భావోద్వేగాలు ఒకవైపు కొనసాగుతుండగా.. మరోవైపు ఇంటి సభ్యుల ఆటతీరుపై బయట ప్రేక్షకుల్లో ఉన్న అభిప్రాయాలను బిగ్ బాస్ స్క్రీన్‌పై చూపించడం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా షాలినీ, రాం ప్రసాద్, త్రిగుణ్, వర్షిణి, సుధీర్‌లపై వచ్చిన కామెంట్లు ఇంట్లో చర్చకు దారితీశాయి. కెప్టెన్సీ కంటెండర్ టాస్కుల్లో భాగంగా రెండు బజర్‌లను ముందుగా ఎవరు టచ్ చేశారనే దానిపై నరేష్, వంశీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని తేల్చే బాధ్యత త్రిగుణ్‌పై పడింది. మొదట నరేష్ ముందుగా బజర్ పట్టుకున్నాడని చెప్పిన త్రిగుణ్.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. చివరకు వంశీనే ముందుగా బజర్ టచ్ చేశాడని ప్రకటించాడు. ఒకవేళ తన నిర్ణయం తప్పయితే దానికి తానే బాధ్యత వహించి పనిష్మెంట్ తీసుకుంటానని త్రిగుణ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది.

మరో టాస్క్‌లో వంశీ, ఝాన్సీ పోటీ పడగా.. ఝాన్సీ విజయం సాధించింది. దీంతో ఆమెకు కెప్టెన్సీ కంటెండర్‌గా నిలిచే అవకాశం రావడంతో పాటు ఫ్యామిలీ ఫోటోను పొందే ఛాన్స్ కూడా దక్కింది. అయితే తనకు లభించిన ఆప్షన్స్‌లో నరేష్‌కు సంబంధించిన లెటర్‌ను ఎంచుకున్న ఝాన్సీ.. దాన్ని ముక్కలు చేయడంతో నరేష్‌కు టెన్షన్ మొదలైంది. తర్వాత కంటెస్టెంట్లకు కాస్త రిలీఫ్ ఇచ్చేలా గార్డెన్ ఏరియాలోకి బిగ్ బాస్ భారీగా ఫుడ్ పంపించాడు. ఇంటి సభ్యులంతా కలిసి ఫుడ్‌ను ఎంజాయ్ చేశారు. కానీ ఆ ఆనందం